క్లుప్తంగా

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మెట్‌పల్లి రూరల్: ఎస్సారెస్పీ కాల్వలో నీటిని విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మాట్లాడారు. ఓ వైపు వర్షాలు కురవకపోవడం , మరోవైపు ఎస్సారెస్పీలో నీళ్ల లేకపోవడంతో పంటల సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నీటిని విడుదల చేయకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయని, వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఒజ్జెల శ్రీనివాస్,పుల్ల జగన్,రాజేంద్రప్రసాద్, శివచరణ్,గంగరాజు,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని రిశ్విత ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథమేటిక్స్ ఒలంపియాడ్‌లో(ఐఎంవో)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 7వ , జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, డైరెక్టర్ మానికారావు, అజిత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ను కలిసిన రైతులు



గంగారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కథలాపూర్: జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని కథలాపూర్ మండలానికి చెందిన రైతు నాయకులు గడ్డం భూమారెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఆదివారం మెట్‌పల్లిలో కలిశారు. ఈ ప్రాంత రైతులకు మేలు చేసేలా పసుపు బోర్డు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభం కోసం పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డిని సన్మానించారు.

ఇసుక లారీలు పట్టివేత

మెట్‌పల్లి రూరల్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలను పట్టుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసినట్లు చెప్పారు. సత్తక్కపల్లి,బండలింగాపూర్ శివారు ప్రాంతంలో జాతీయ రహదారిపై 10 లారీలు పట్టుబడ్డాయన్నారు. మెట్‌పల్లి ఆర్‌ఐ కాంతయ్య ఫిర్యాదు ఫిర్యాదు మేరకు లారీ ఓనర్లు,డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్యవైశ్యుల వనభోజన మహోత్సవం



మూటపెల్లి లో ఆర్యవైశ్య కుటుంబాలు

రాయికల్: పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మూట పెల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆషాడ మాస వనభోజన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 100 మంది కుటుంబ సభ్యులంతా కలిసి ఒకే చోట చేరి ఆటపాటలతో సరదాగా గడిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు జిల్లా లావణ్య, ప్రధాన కార్యదర్శి సిద్ధంశెట్టి స్వప్న, కోశాధికారి అయిత మాధవి. తదితరులు పాల్గొన్నారు.

బడిని బతికించుకున్నారు..

- నాగులపేట సర్కారు బడికి గ్రామస్తుల చేయూత
- పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు
- విరాళాలు సేకరించి వలంటీర్ల నియామకం



కోరుట్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నప్పటికీ చాలా మంది ప్రైవేట్ మోజులో చాలా మంది తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ క్రమంలో పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ పాఠశాలలు మూతపడుతున్నాయి. అదే కోవలో కోరుట్ల మండలంలోని నాగులపేటలోని ప్రైమరీ పాఠశాల పరిస్థితి ఉండేది. గతేడాది ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య కేవలం 17 మందికే పరిమితమైంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గితే పాఠశాల మూతపడుతుందని గుర్తించిన గ్రామస్తులు బడిని బతికించేందుకు కంకణం కట్టుకున్నారు.

ఇంటింటికి వెళ్లి..

గ్రామంలో ఏ ఇంట్లో విద్యార్థులున్నారో వివరాలు సేకరించి, గ్రామంలో యువకులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి మన ఊరి బడిలోనే మంచి చదువు చెప్పేలా చేస్తామని అందుకు తాము బాధ్యత వహిస్తామని భరోసా ఇచ్చి పిల్లలను సర్కారు బడిలో చేర్పించేలా ఒప్పించారు. దీంతో ప్రైమరీ పాఠశాలలో గతేడాది 18 మంది విద్యార్థులుండగా, ఈ ఏడాది సంఖ్య 62కు చేరింది. హైస్కూల్ సంఖ్య గతేడాది 69 ఉండగా ఈ విద్యా సంవత్సరం 95 కు పెరిగింది.

విరాళాలు సేకరించి..

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండకుండా వలంటరీ టీచర్లను నియమించాలని గ్రామస్తులు నిర్ణయించారు. వారికి వేతనాలు చెల్లించేందుకు విరాళాలు సేకరించారు. సుమారు రూ.3.5 లక్షలు ఫండ్ జమ చేశారు వాటి నుంచే నలుగురు వలంటరీర్లకు వేతనాలు చెల్లిస్తున్నారు. అంతే కాకుండా ప్రైమరీ పాఠశాలకు రంగులు వేసి విద్యార్థులను ఆకర్షించేలా గోడలపై బొమ్మలు వేశారు. పిల్లలకు శుద్ధ జలం కోసం వాటర్ ఫిల్టర్‌ను కూడా ఏర్పాటు చేయించారు. గ్రామంలోని విద్యావంతులు తరచూ పాఠశాలను సందర్శిస్తూ, అవసరాలను గుర్తిస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయులను, ఇటు విద్యా వాలంటీర్లలో ఉత్సాహం నింపుతున్నారు.

మాపిల్లలను బడిలో చేర్పించా



ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేందుకు మా పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాను. పాఠశాలకు అవసరమైన వసతుల కల్పనకు నా వంతు కృషి చేస్తున్నాను. రూ. 5 లక్షలు సొంత ఖర్చులతో హైస్కూల్ ప్రహరీ నిర్మిస్తున్నాను. గ్రామస్తులు కూడా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నారు.

– కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్

టీచర్ల సంఖ్య పెంచాలి



ప్రస్తుతం ప్రైమరీ స్కూల్‌లో ఇద్దరే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. మరో ఉపాధ్యాయున్ని నియమిస్తే బాగుంటుంది. అదే విదంగా హైస్కూల్‌లో కూడా ఒక ప్రభుత్వ టీచర్‌ను పెంచాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు గ్రామం నుంచి నియమించిన వలంటరీ టీచర్లతో విద్యార్థుల సంఖ్య రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

– లవంగ సాగర్, నాగులపేట

గ్రామస్తుల సహకారం అభినందనీయం



నాగులపేట పాఠశాలలకు గ్రామస్తులు అందిస్తున్న సహకారం అభినందనీయం. విరాళాలు సేకరించి ప్రైవేట్ వలంటీర్లను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా పాఠశాలలో ఎలాంటి అవసరాలున్నా గ్రామస్తులు బాగా సహకరిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా సహకరించాలి.

– గంగుల నరేశం, ఎంఈవో, కోరుట్ల

ఘనంగా పోచమ్మ బోనాలు



మెట్‌పల్లిలో బోనాలతో వస్తున్న గంగపుత్రులు

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణ వంజరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. పోతురాజుల విన్యాసాలు, పెద్ద పులి వేషదారుల సందడితో ఆదివారం నిర్వహించిన ఈ బోనాల కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, రమేష్‌రావు, పుప్పాల అశోక్, స్థానిక నాయకులు కాలేరు నాగేంద్ర, అసింసావన్‌తో పాటు వంజరి సంఘం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని రాంనగర్ కు చెందిన శ్రీ లక్ష్మీ నరసింహ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుక వెళ్లి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాడవేణి నరేశ్, నాయకులు సురేష్, అశోక్, రాజం, లింగన్న, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలో పోచమ్మ బోనాల వేడుకలను గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ సభ్యులు డప్పు చప్పుళ్ల మధ్య గొల్లెండ్లతో ఊరేగింపుగా శివారులో ఉన్న ఆలయానికి తరలివె వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పల్రె శంకర్, మాస్కల చిన్నయ్య, ఆర్మూర్ నరేందర్, పరిమి నర్సయ్య, సాయిలు తదితరులున్నారు.

స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడిగా జలంధర్



నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

కథలాపూర్: స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడిగా పోతారం గ్రామానికి చెందిన ధర్మపురి జలంధర్ ఎన్నికైనట్లు సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం కథలాపూర్‌లో మండల కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా వెగ్యారపు మనోహర్, ఉపాధ్యక్షుడిగా ఉరుమల్ల కృష్ణాచారి, కోశాధికారిగా ఉరుమల్ల కిరణ్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా శ్రీరాముల ప్రకాశ్, కార్యవర్గసభ్యులుగా దురిశెట్టి కర్ణాకర్, బెజ్జారపు శివరాం, ఇందూరి ప్రతాప్, ఆంజనేయులు, నరేశ్ ఎన్నికయ్యారు. అనంతర సంఘం సభ్యులు నూతన కార్యవర్గసభ్యులను సన్మానించారు.

రాజ్యాంగంతోనే హక్కుల సాధన



ప్రతాప్‌ను సన్మానిస్తున్న నాయకులు

మల్యాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దూరదృష్టితో రాసిన రాజ్యాంగంతోనే అట్టడుగు వర్గాల ప్రజలు తమ హక్కులు పొందుతున్నారని, అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు బెజ్జంకి చిన్నదుర్గయ్య అన్నారు. మల్యాలకు చెందిన మల్యాల ప్రతాప్ కరీంనగర్ జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రతాప్‌ను అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించా7

రు. ఈ సందర్భంగా దుర్గయ్య మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంతో మాదిగ బిడ్డలు ఇప్పుడిప్పుడే పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారన్నారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ మాట్లాడుతూ రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నలువాల సంజీవ్, ముప్పారపు రాంచంద్రం, మల్యాల ఈశ్వర్, మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, కట్కూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా రాజేశ్



ఎన్నికైన అధ్యక్షకార్యదర్శులు రాజేష్, మహేశ్

ధర్మపురి: మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడిగా చీపిరిశెట్టి రాజేష్ ఎన్నికయ్యారు. పట్టణంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో ఆదివారం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బండి మహేశ్, ఉపాధ్యక్షులుగా చల్ల రవి, ముత్తినేని లక్ష్మణ్ తదితరులు గెలుపొందారు.

మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన రైతులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామానికి చెందిన రైతులు ఆదివారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. బ్యారేజీకి ఏమి నష్టం జరగలేదని, ఈ బ్యారేజీ ద్వారా ఎస్సారెస్పీ వరదకాలువకు నీటిని విడుదల చేయవచ్చన్నారు. ప్రభుత్వం చొరవ చూపి మేడిగడ్డ బ్యారేజీ నుంచి వరదకాలువకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు, నాయకులు పిడుగు ఆనంద్‌రెడ్డి కోరారు.

రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపితే చర్యలు

పెగడపల్లి:రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై కిరణ్‌కుమార్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడిపి రోడ్లను పాడు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కేజీవీల్స్‌తో రోడ్లపై వెళ్లాల్సి వస్తే ప్రత్యేకంగా తయారు చేసిన పట్టీలు అమర్చు కోవాలని సూచించారు. ఎవరైనా కేజీవీల్స్‌తో రోడ్లపై వెళ్తూ పోలీసులకు పట్టుబడితే ట్రాక్టర్ సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు వెళ్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

నాటుసారా విక్రేతపై కేసు

కథలాపూర్: మండలంలోని పోసానిపేట గ్రామంలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న బత్తుల రాజలింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ ఆదివారం తెలిపారు. నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు రాజలింగం ఇంట్లో సోదాలు చేయగా, 10 లీటర్ల నాటుసారా కనిపించిందన్నారు. నాటుసారాను స్వాధీనం చేసుకుని రాజలింగంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాజారంలో ఉచిత వైద్య శిబిరం

ధర్మపురి: మండలంలోని రాజారంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కరీంనగర్, జగిత్యాల అపెక్స్, చిల్డ్రన్స్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ వైద్యుడు ఎదలాపురం మహేందర్ ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో 100 ఈసీజీలు, 200 మందికి షుగర్ పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అఖిల్, ప్రశాంత్, కృష్ణ, అద్రూసన్ తదితరులున్నారు.

పరామర్శ

ధర్మపురి: వివిధ కారణాలతో పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ ఆదివారం పరామర్శించారు. ధర్మపురికి చెందిన తిర్మాందాస్ మణికంఠ, బోయవాడకు చెందిన కొమురెల్లి సురేశ్, నేరెల్ల గ్రామానికి చెందిన జాజాల పెద్ద వెంకన్న పలు కారణాలతో మృతి చెందగా, బాధిత కుటుంబాలను రాజేందర్ పరామర్శించి ఓదార్చారు.

అంతర్జాతీయ గైనకాలజిస్టుల సదస్సులో కోరుట్ల డాక్టర్



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ స్వీతీ అనూప్

కోరుట్ల: పట్టణానికి చెందిన గైనకాలజిస్టు స్వీతీ అనూప్ రావుకు హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ గైనకాలజిస్టుల సదస్సులో ప్రసంగించే అవకాశం దక్కింది. ఈ సదస్సులో సుమారు 18 వేల మంది డాక్టర్లు పాల్గొనగా.. కోరుట్లలో ఆసుపత్రి నిర్వహిస్తున్న అనూప్ మహిళలు – పురుత్పత్తి అనే అంశంపై ప్రసంగించి ఆకట్టుకున్నారు. అనూప్‌రావుకు ప్రసంగించే అవకాశం దక్కడంపై కోరుట్ల, మెట్‌పల్లి ఐఎంఏ వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.



జగిత్యాలటౌన్: గృహ అవసరాలకు వినియోగించాల్సిన వంట గ్యాస్ సిలిండర్లను కొందరు కార్లలో నింపుతూ పక్కదారి పట్టిస్తున్నారు. వంట గ్యాస్ సిలిండర్లను గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలన్న నిబంధనలను పట్టించుకోకుండా తమ కార్లలో నింపుతున్న కొందరు వ్యక్తులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. సివిల్ సప్లై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గృహ అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి సెల్ నం.: 8639919527

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

గడి బురుజు వద్ద నూతన కట్టడాలకు అనుమతి

కోరుట్ల: పట్టణంలోని గడి బురుజుల ప్రాంతంలో 15 ఫీట్లు దాటి ఇండ్ల నిర్మాణాలు చేపట్టుకునేందుకు సంబంధిత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జయేశ్ రంజన్ జిల్లా కలెక్టర్, కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడి గురుజుల ప్రాంతంలో 300 ఫీట్లవరకూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా నిబంధన ఉండేదని, ఈ విషయంపై రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రికి వినతిపత్రం ఇవ్వగా, పూర్తి సమాచారం సేకరించి 15 ఫీట్లు దాటి నిర్మాణాలు చేసుకునే విధంగా ఉత్తర్వులు ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు అనుమతులిచ్చిన రాష్ట్ర మంత్రి కృష్ణారావుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అదేవిదంగా గడి గురుజు ప్రాంత వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవాభారతి కార్యక్రమాలకు చేయూతనందించాలి



మాట్లాడుతున్న గర్వందుల జయంతి

జగిత్యాలటౌన్: వాల్మీకి ఆవాసం సేవాభారతి ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ ద్వారా మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, సేవాభారతి కార్యక్రమాలకు ప్రతీ ఒక్కరూ చేయూతనందించాలని ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ గర్వందుల జయంతి కోరారు. వాల్మీకి ఆవాసం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 150 మందికి ఆదివారం వాల్మీకి ఆవాసంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయంతి మాట్లాడుతూ 32 ఏళ్లుగా వాల్మీకి ఆవాసం ద్వారా విద్యాభ్యాసం చేసిన ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ప్రస్తుతం వివిధ హోదాల్లో స్థిరపడటం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘ్ సంచాలక్ డాక్టర్ భీమనాతిని శంకర్, సేవాభారతి అధ్యక్షులు ఎస్పీ సుబ్రహ్మణ్యం, విభాగ్ సేవా ప్రముఖ్ రాజేందర్, కట్ట చంద్రశేఖర్, తహసిల్దార్ రాజ్‌మనోహర్, ఆవాసం కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, కమిటీ సభ్యులు అశోక్‌రావు, సంపూర్ణచారి, చిత్తారి మధుకర్, మల్లేశం పాల్గొన్నారు.

అద్దంలో ముఖం.. మురిసిన వానరం



పెగడపల్లి: మండల కేంద్రంలోని ఓ ఇంటి ముందు నిలిపిఉన్న ద్విచక్ర వాహనంపై ఎక్కిన వానరం తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకుంటూ తన రూపాన్ని పదేపదే తిలకిస్తూ మురిసి పోయింది. సౌందర్యాన్ని ఆస్వాదించిన వానరం చివరకు వాహన యాజమాని రావడంతో అద్దాన్ని వదిలి వెళ్లిపోయింది. ఆదివారం మండల కేంద్రంలో సాక్షి కంటపడగా క్లిక్ మనిపించింది.

ఘనంగా గోరింటాకు మహోత్సవం



గోరింటాకు చేతులను చూపుతున్న మహిళలు, చిన్నారులు

మల్లాపూర్ : ఆషాఢ మాసం పురస్కరించుకుని గోరింటాకు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, చిన్నారులు చేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం అనాదగా వస్తున్న సంప్రదాయమన్నారు.